

# పుస్తక పరిచయం




***Publishers***
Vamsee Cultural & Educational Trust, India

Vanguri Foundation of America,
PO Box # 1948, Stafford, TX 77497
Phone: 832 594 9054
Email: vangurifoundation@gmail.com

**చాలా విషయాల్లో** పరిమితుల గురించి, పరిధుల గురించి కొన్నికొన్ని అభిప్రాయాలు ప్రజల్లో నాటుకుపోయి ఉంటాయి. అందుకు కారణాలు ఉండొచ్చు కానీ, చాలా మంది విశ్లేషణకు పోకుండా ఆయా పరిమితుల్ని, పరిధులని అలాగే నమ్మేసి వాటిని అధిగమించడానికి వీలౌతుందేమో అన్న ఆలోచనవైపు కూడా వెళ్ళరు. "ఈ కాలంలో యువతరం అత్యంత వేగంగా పరుగులుతీస్తోంది. ముఖ్యంగా ఆంధ్రదేశంలోని యువతీ యువకులంతా పోటీపరీక్షలు, కెరీర్ మీదనే కేంద్రీకరిస్తున్నారు కానీ సాహిత్యం, కళలు ..ఇలాంటి వాటిగురించి అస్సలు ఆసక్తి చూపించడంలేదు" - ఇదీ ఒక సిద్ధాంతం. ఇందులో అబద్ధమేం లేదు. ఐతే కొంతప్రయత్నంచేసి తెలుగుసాహిత్యం మీద ఆసక్తి, ప్రతిభ వున్న యువతీ యువకుల్ని సమీకరించగలమా, ఒక్కచోట చేర్చగలమా.. అని విభిన్నంగా ఆలోచించారు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు. తమ ఆలోచనని ఆచరణలో పెట్టి ‘ఇది సాధ్యమా!?’ అని అందరూ ఆశ్చర్యపోయేలా చేశారు. మొన్న సెప్టెంబర్ 29వ తేదీ నుంచి అక్టోబర్ 5వరకూ హైదరాబాదులో మొట్టమొదటి జాతీయ యువసాహితీ సమ్మేళనాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ‘కొంతమంది యువకులు..పావన నవజీవన బృందావన నిర్మాతలు‘ అన్న శ్రీశ్రీ వాక్యాలను సాకారం చేస్తూ కేవలం 15 - 35 సంవత్సరాల వయసుగల రచయిత, రచయిత్రులని ఒకచోట చేర్చి వారంపాటు సాహితీ సభలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న యువతీ యువకులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై "తెలుగు సాహిత్యానికి మంచి రోజులున్నాయి, మేమంతా అందుకు నిదర్శనం" అని ఎలుగెత్తిచాటారు. ఆ సాహితీ వారోత్సవంలో పాల్గొని పదిమందితో పంచుకున్న ఆ రచనలని ఒక పుస్తకరూపంలో ప్రచురించిన వంగూరి ఫౌండేషన్ కృషిని, కార్యదీక్షని ఎంత ప్రశంసించినా సరిపోదు. ఇందులోని రచనలనన్నింటిలో ఎంతో పరిణితి కనిపిస్తోంది. కథలు, కవితలు, వ్యాసాలు, గేయాలు, విశ్లేషణలూ -- అన్నీ ఏ లబ్ధప్రతిష్ఠులైన రచయితల రచనలకీ తీసిపోవు. ఇందులోని రచనలనన్నింటినీ ముందుగానే సేకరించి కార్యక్రమాలు పూర్తయే సరికే వాటికి గ్రంధరూపం కలిపించడం కార్యకర్తల నిబద్ధతకి నిలువెత్తు నిదర్శనం. రచయితల ఛాయాచిత్రాలు, సంక్షిప్తపరిచయాలు కూడా చేర్చి ఉంటే మరింత నిండుదనం సమకూరేది. తెలుగుసాహితీరంగంలో అనేక వినూత్న కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు పరుస్తున్న, వంగూరి ఫౌండేషన్ సారధి, చిట్టెన్ రాజుగారు, ఇండియా కార్యక్రమాల సమన్వయకర్త వంశీ రామరాజుగారు ఎంతైనా అభినందనీయులు.

***




**శిఖరాలనధిరోహించడమే** కాదు, పడిపోయిన లోయల్లోంచి పైకి రావడం కూడా విజయమే. ఎవరితోనో పోటీపడి గెలవడమే కాదు, తనని తాను తెలుసుకుని సవ్యమైన జీవనమార్గన్ని ఎన్నుకోవడం కూడా విజయమే. కష్టాలూ, కన్నీళ్ళూ, బాధలూ, బరువులూ.. జీవితంలో భాగమే ఐనా వాటిని తట్టుకుని నిలబడడమే ముఖ్యం. ఇబ్బందులు ఎదురైనప్పుడు పరిస్థితులనో, ఇంకెవరినో నిందించడం చాలా తేలికపని. జరిగిన వాటన్నింటికీ బాధ్యత వహించి పొరబాట్లని సర్దుకునే స్వయం విశ్లేషణ, ఆత్మావలోకనం పెంపొందించుకోవడం ..అదొక కళగా చెప్పుకోవచ్చు. అలాంటి కళని జీవితంలో భాగంగా చేసుకుని, జీవితం చూపించిన చేదు అనుభవాలన్నింటినీ వ్యక్తిత్వ వికాస పాఠాలుగా మలచుకున్న ఒక మహిళ కథ ఈ ఆంగ్లపుస్తకం 'Butterfly, Journey from my Cocoon'. ఇది కాల్పనిక కథ కాదు, నిజంగా జరిగిన కథ. ఎవరికో జరిగిన కథకాదు రచయిత్రి ఆత్మకథ. పైచదువులకోసం అమెరికా వచ్చారు రచయిత్రి. వివాహం ఐన సంవత్సరానికే bone-marrow disorder వ్యాధి పంజా విసిరింది. రెండేళ్ళపాటు మృత్యువుతో హోరాహోరీ పోరాడారు. అత్యంత భయంకరమైన, బాధాకరమైన వైద్యవిధానాలని తట్టుకుని మృత్యువుని ఓడించారు. మళ్ళీ మామూలు మనిషిగా మారాక వైవాహిక జీవితంలో ఒడుదుడుకులు, కలవని అలవాట్లు, సర్దుబాటుకాని మనస్తత్వాలు. బాబు పుట్టిన కొద్ది నెలలకే ఒంటరి తల్లిగా మరో ప్రయాణం.. - ఇవన్నీ రచయిత్రికి జీవితం చూపించిన అనుభవాల పరంపర. కేవలం ఇది రచయిత్రి కథ మాత్రమే అనిపించదు, ఆమె విశ్లేషించిన పరిస్థితులు, వాటిల్లోంచి తను తేరుకున్న విధానం ఎన్నో ఆలోచనలు రేకెత్తిస్తుంది. పుస్తకం చదువుతున్నంత సేపు రచయిత్రితో పాటు మనమూ ప్రయాణించి, ఆ ఒడుదుడుకుల్ని మానసికంగా అనుభవించి, చివరికి జీవితం నేర్పే పాఠాలతో బయటికి వస్తాం. వ్యక్తిగత జీవితంలో ఎదురైన భయంకరమైన ఒత్తిళ్ళని సానుకూల దృక్పథంతో తాను ఎదుర్కొన్న వైనాన్ని, రచయిత్రి ఎంతోమందికి ఉపయోగకరమయ్యేలా వివరించారు.

***

*Published By*

Tough Times Never Last Publishing
Little Rock, Arkansas, USA

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**